బందీ

ఇది నేను ఆర్డీవో కాక ముందటి మాట. సమయం వచ్చింది కాబట్టి చెప్తున్నాను. ప్రతి మనిషి జీవితంలోనూ ప్రేమించే సమయం ఒకటి వస్తుందనుకుంటాను. నాకూ అలాగే జరిగింది.

నేను ఎమ్మెస్సీ, బి.ఇడి. చేశాక అప్పర్ ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. సొంత జిల్లాలో మొదటి ఉద్యోగం అది. అప్పటికి గ్రూప్ వన్ మెయిన్ పరీక్షలు పూర్తి చేశాను. ఆర్డీవో ఉద్యోగం రావాలంటే ఎన్ని మెలికలో, వచ్చేదాకా నాకా విశ్వాసం లేకపోయింది. పల్లెటూళ్ళో ఉద్యోగం భలే పసందు అన్పించి మనస్సు ఉరకలు వేసింది.

నేను పుట్టింది పల్లెటూళ్ళోనే అయినా ఎనిమిదో తరగతి నుండి ఊరు వదిలి హాస్టల్లో చేరాను. అప్పటినుంచి పట్నం, పల్లె జీవితాలు రెండూ నాలో పెనవేసుకున్నాయి. నేను పల్లెలకు మరీ దూరం కాలేదు. మరీ దగ్గర కాలేకపోయాను. పెరుగుతున్న నా విద్యావసరాలు నన్ను పల్లెల గురించి పట్టించుకోనీయలేదు. డబ్బులు వెసులుబాటులేక పట్న జీవితాన్ని అనుభవించలేదు. రెంటికీ ప్రేక్షకుడిలా పైసా ఖర్చు లేకుండా అనుభవం మాత్రం సంపాదించాను.

పల్లెటూళ్ళో బడిపంతులు ఉద్యోగం నాకు ఎంతో థ్రిల్లింగ్‌గా వుంది. అదీ మా ఊరికి 50 కిలోమీటర్లలోపే వుండడం కూడా ఒక కారణమేమో. నేనూ ఒక ప్రయోజకుడినయ్యానని నాకొచ్చిన ఉద్యోగం నన్ను సర్టిఫై చేసినట్టుగా సంతోషం. అంతకు ముందు పనులు చేయలేదని కాదు. కానీ మధ్యతరగతి తాలూకు వృత్తిని చేపట్టడం అదే తొలిసారి. నాలో ఆనందం పొంగులు వారడానికి అది కూడా ఒక ప్రధాన కారణమే.

అంతకుముందు చిన్నప్పుడు మా అవ్వతో వెళ్ళి పటేండ్ల ఇండ్లల్లో పశువుల పేడ తీసేవాణ్ణి. మా వూరి రెడ్డి నన్ను పాలేరుగా జీతానికి వుంచుకోవాలనే చూశాడు. మా అవ్వ (అమ్మ) మనస్సు గట్టిది. మా నాయిన (నాన్న) హృదయం గొప్పది. చేసేది ఇటుకబట్టీల కూలిపనైనా చదువుతో ఒనగూడే ప్రయోజనాల గురించి గొప్ప అవగాహన గలవాడు. నన్ను కనీసం బడిపంతులునైనా చేయాలని మా నాయిన తపన.

చిన్నప్పుడు ఆటకోయిలతనం. నాకు చదువంటే గిట్టేది కాదు. అవ్వ, నాయనలతో పనికి పోవాలంటేనే సంతోషం. ఎందుకో నాకు చిన్నప్పటినుంచీ పనిలోనే ఆనందం. ఏదో ఒక పని చేయాలనిపించేది. ఊరికే కూర్చోబెట్టి ఇది రాయి అది రాయి అనే చదువంటే ఎంతో విసుగ్గా వుండేది. స్కూళ్ళో ఆడించే ఆటలు ఎంతో పసందుగా వుండేవి. అన్నిట్లో ఏదో ఒక ప్రైజు సంపాదించేవాణ్ణి. నాకు ప్రయిజు వచ్చిన స్టీలు గ్లాసు తొర్రిబోయినా ఇప్పటికీ అదంటే నాకెంతో ప్రేమ.

హాస్టల్లో చేరడానికి ఎన్ని తిప్పలు పడ్డానో, హాస్టల్లో చేరాక చిల్లర పైసలు లేక అపుడపుడు రైసు మిల్లుకు రాత్రిళ్ళు పనికి పోయేవాణ్ణి. ఆ పైసల్తో నోటుబుక్కులో, సిన్మా టికట్లో కొనుక్కునేవాణ్ణి.

కాలేజిలో చదువుతున్నప్పుడు సకాలంలో స్కాలర్‌షిప్పులందేవి కావు. నాయిన పైసలు పంపలేకపోయేవాడు. డెయిలీ పేపరు వేసి, పాల ప్యాకెట్లు వేసి, సెంట్రింగ్ పనికిపోయి, గోడపని నేర్చుకుని - ఇట్లా ఎన్ని పనులు చేశానో. ఓ సిన్మాటాకీసు కాడ గల పాన్‌షాపు కోసం తమలపాకుల తొడిమలు తోకలు, ఛాలియాలు కత్తిరించడానికి కొద్దికాలం పార్ట్‌టైం జాబ్ వంటిది చేశాను. తర్వాత్తర్వాత పిల్లలకు ట్యూషన్లు చెప్పడం ప్రారంభించాను.

నిజం చెప్పాలంటే నేను నిజంగా ప్రేమంటే ఏమిటో తెలుసుకున్నది ట్యూషన్లు చెప్తున్నప్పుడే. ప్రేమను గెలుచుకోవడం మొదలైంది కూడా అపుడేననుకుంటాను. లిల్లీ నన్ను ఇప్పటికీ ఎంతగా ప్రేమిస్తుందో చెప్పలేను. అప్పుడు దానికి నేను ఏడో తరగతి ట్యూషన్ చెప్తున్నాననుకుంటాను. ఇపుడది పి.జి. చేస్తోంది. అది ఇపుడు బాబాయి అంటూ వరస కూడా కలిపేసింది.

లిల్లీ నన్ను అమాయకంగా ప్రేమించేది. దాని అల్లరి ఇంతా అంతా కాదు. నాకు పెద్దవాళ్ళ ఇళ్ళల్లో సంకోచం మరీ ఎక్కువ. బాగా చెప్పి మంచి వాణ్ణనిపించుకోవాలని తపన. లిల్లీ మెల్లమెల్లగా మారుతుంటే వాళ్ళమ్మ కళ్ళల్లో ఎంత వెలుగో.

లిల్లీ వాళ్ళమ్మే మొదటిసారిగా బయటి ప్రపంచానికి సంబంధించిన ప్రేమంటే ఏమిటో తెలిపింది. జానకి ఆమె పేరయినా, లిల్లీ వాళ్ళమ్మ అనే నాకు పిలవాలనిపిస్తుంది.

జానకి క్రమక్రమంగా నన్నూ వాళ్ళ కుటుంబ సభ్యునిలా ఆదరించడం మొదలైంది. కుటుంబంలో వుండే మధ్య తరగతి మర్యాదలు నేను వారింటి నుంచే నేర్చుకున్నాను. అవి నాకెంతగానో ఉపయోగపడ్డాయి.

జానకి చూపే ప్రేమ చూస్తుంటే ఎంతగానో ప్రేమించబుద్ధయ్యేది. ఆమె నాకన్నా ఎంతో పెద్ద. మంచి ఉద్యోగస్తుడి ఇల్లాలు, నిర్మలమైన మనస్సు, ఇద్దరు పిల్లలు.

అయినప్పటికీ నేను జానకిని ప్రేమించడానికి ఇవేవీ అడ్డంకి కాలేదు. నా ప్రేమ నా హృదయంలోనే వున్నంతకాలం ఏ ప్రమాదమూ లేదని నాకు తెలుసు. నా ప్రేమలో సెక్సు కోణం వుందా అని ఆలోచిస్తే ఒకసారి వుందనిపించేది. ఒకోసారి లేదనిపించేది. అలాంటి తర్కం ప్రవేశించినపుడు మనసు గజిబిజి అయ్యేది. ఏదో తప్పు చేస్తున్నానా అని మనస్సు పీకేది. అందువల్ల ప్రేమించే హృదయాన్నే పెంచుకున్నాను గానీ తర్కాన్ని దూరం తరిమాను.

లిల్లీ వాళ్ళమ్మ నాకు ఆరాధ్య దేవత. భక్త మీరాబాయి కృష్ణున్ని కొలిచింది. అందులో వున్నది ఆరాధనేనా - సెక్సు భావన అంతర్లీనంగా వుందా అని ప్రశ్నిస్తే జవాబు ఎవరి సంస్కారాన్ని బట్టి వారికందుతుంది. మీరాబాయి కృష్ణున్ని కొలిచినట్టు నేను లిల్లీ వాళ్ళమ్మను కొలిచాను. అదొక మధుర భావన.

కొన్ని ప్రేమలు మధురంగా వుంటాయి. వ్యక్తం చేయనవసరం లేని ప్రేమ మరీ మధురంగా వుంటుంది. లిల్లీ వాళ్ళమ్మ పట్ల నాకున్న ప్రేమ వ్యక్తం చేయనవసరంలేని ప్రేమే. ప్రేమను వ్యక్తం చేయడం వల్ల ప్రేమ అనే శక్తి కొంత ఖర్చయిపోతుందనుకుంటాను.

జానకి నాలో ప్రేమ ఉదయించడానికి ప్రేరణ ఇచ్చిన మాతృమూర్తి. ఇప్పుడు లిల్లీ వరుస కలపడంతో జానకి నాకు వదినయిపోయింది. జానకి నిజంగా నాకు వదినే. శరత్ పాత్రల్లోని వదినలా, తల్లిలా ఎన్ని నేర్చుకోవడానికి ప్రేరణ అయ్యిందో, జానకి నన్నొక సొంత తమ్ముడిలా ఆదరించేది.

అప్పుడు సంకోచించాను గానీ నాకిపుడా సంకోచం లేదు. మొన్నామధ్య లిల్లీతో అనేశాను కూడా. 'నేను మొదట నిజంగా ప్రేమించింది మీ అమ్మనే' అని. లిల్లీ గలగలా నవ్వేసింది. ఆ రోజు జానకీ, వాళ్ళాయనా కూడా ఇంట్లో భోజనాలకాడ ఇదే మాట గుర్తు చేసుకుంటూ పదే పదే నవ్వులు.

నా భావాన్ని అర్థం చేసుకోలేకపోతే జానకిని నేను ప్రేమించాను అనే మాట ఎన్ని అనర్థాలు సృష్టించేదో! అందుకే నేనెపుడూ నేను నేనుగా ఎదిగేదాకా నా ప్రేమను వ్యక్తం చేయలేదు.

కాలేజీ రోజుల్లో క్లాసుమేటు అమ్మాయిల్ని నేను ప్రేమించలేదని కాదు. అందంగా, హొయలు పోయే అమ్మాయిలందర్నీ ప్రేమిస్తున్నాననుకునే వాణ్ణి. ఎవరో ఎప్పుడో ఒకప్పుడు కలలోకొచ్చేవాళ్ళు. అయినప్పటికీ దాన్ని ప్రేమగా నేను ఆనాడూ సీరియస్‌గా ఫీల్ కాలేదు. ఈనాడూ ఫీల్ కావడం లేదు. అదొక ఆట. అదొక టైంపాస్ సోషల్ రిలేషన్స్ లాగే అనిపించేది. ఎన్ని ప్రేమ కబుర్లు చెప్పుకున్నా అందులో ప్రేమ వుందని అనుకోను. ఆ వయసు అలాంటిది. అవన్నీ పైపై ప్రేమలు. అలా నేను ఫీల్ కావడానికి వాళ్ళు నాకు అందని ద్రాక్ష పుల్లన అనే భావం లోలోపలే ఎక్కడో వుండడం కూడా కారణం కావచ్చు.

లిల్లీ వాళ్ళమ్మను ప్రేమించినవంటి ప్రేమలో పడింది నేను బడిపంతులు ఉద్యోగంలే చేరాకే. జానకిని ప్రేమించడం నాలోని ప్రేమను, హృదయాన్ని నన్ను నేను తెలుసుకోవడానికి ఎదగడానికి సంబంధించింది. కానీ బడిలో పరిచయమైన రేణుకను మాత్రం నిజంగానే ప్రేమించాను. నన్ను నేను తెలుసుకోవడానికి కాకుండా, నన్ను నేను గెలుచుకోవడానికే రేణుకను ప్రేమించాను.

రేణుతో నా ప్రేమ సాదాగానే మొదలైంది. నేనా ఊరికి కొత్త. నాకన్నా కొద్ది నెలల ముందే రేణు ఆ స్కూల్లో టీచరుగా చేరింది. రేణు ఆ వూరి ఆడపడుచే. రెడ్లమ్మాయి. బి.యస్సీ., బి.ఇడి. చేసింది. పాఠశాల విద్యా కమిటీ ఆమెను నెలకో అయిదు వందల గౌరవ వేతనం మీద అపాయింటు చేసింది. అప్పర్ ప్రయిమరీ స్కూల్‌ను హైస్కూల్ చేయాలని వారి ఆశ. అందుకే అనుమతిరాకున్నా ఎనిమిదో తరగతి ప్రారంభించారు. విరాళాలతో ఇద్దరు టీచర్లకు గౌరవ వేతనం ఇస్తూ క్లాసులు నడుపుతున్నారు.

రేణు అందంగానే వుంటుంది. రెడ్లమ్మాయి కావడం వల్లో ఏమో లేక సొంత ఊరు కావడం వల్లో గానీ ఆమె నడకలో, మాటలో, సంస్కారంలో ఎంతో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంది. ఇప్పటి మాటల్లో చెప్పాలంటే ఉద్యోగ భద్రత తాలూకు ఆత్మవిశ్వాసాన్ని ఆమె కనపరుస్తూ వుండేది. అదే ఆమె అందంగా లవబుల్‌గా కనపడ్డానికి కారణమేమో. ఎక్కువ కులం అమ్మాయిని గెలుచుకోవాలనే తపన అంతరాంతరాల్లో వుండేదేమో. దాని కారణంగానే ప్రేమలో పడ్డానో అంత స్పష్టంగా చెప్పలేను.

ఏమైతేనేమి నేను మొదటిసారిగా జీవితంలో ప్రేమించింది రేణునే. ఆమె స్కూల్లో చదువు ఎంతో శ్రద్ధగా చెప్పేది. వాళ్ళంతా తన తమ్ముళ్ళన్నంత చనువుగా ఆప్యాయంగా మెలిగేది. పిల్లల్ని ప్రేమించే హృదయం ప్రేమాస్పదంగా వుంటుందేమో. అదే ఆమెలో సౌకుమార్యంగా కన్పడిందేమో.

రేణును స్కూల్లో నిండారా రెండు కన్నుల్తో చూసేవాన్ని. హృదయం తెరిచి హాయిగా నవ్వేవాణ్ణి. రేణు కూడా అచ్చం అలాగే చూసేది. అలాగే నవ్వేది. వాళ్ళ చేన్లు చెలకలు చూసే నెపం మీద పచ్చని చెట్ల నీడల్లో, గట్ల మీదా సోయగాలు పోయేవాళ్ళం.

నాకు ఆ వూళ్లో ఇల్లు దొరకడం కష్టం అయింది. కొన్నాళ్ళు, పొరుగూరి టీచరు ఇంట్లో కాపురం పెట్టాను. ఊళ్లో నాకు అద్దెకు ఇవ్వడం అనేది పెద్ద సమస్య అయిపోయింది. అందరూ సంస్కారవంతంగానే కనపడుతారు. ఒక్క గది కిరాయికిమ్మన్నా లేదంటారు. నా కులం కారణంగానే నాకు ఇల్లు కిరాయికివ్వడం లేదని స్పష్టంగా తెల్సిపోతూనే వుంది.

నాకు పట్టుదల పెరిగింది. మా కులం వాళ్ల ఇళ్ళు కొన్ని ఆ వూళ్ళోనూ లేకపోలేదు. నేను ఆ ఇళ్ళలో మాత్రమే ఎందుకుండాలి! బళ్ళో చదువుకుంటున్నది వాళ్ళ పిల్లలు మాత్రమే కాదు గదా!

వారి పిల్లలకు నేను చదువు నేర్పాలి. బాగా చెప్తానని ప్రశంసిస్తారు. వారికి నేనంటే ఎంతో గౌరవం. కాదనను. ఆ గౌరవం దేనికి పనికొచ్చింది, నాకొక ఇల్లు కిరాయికివ్వలేక పోయాక!

నేనా ఊళ్ళో వుండను - వేరే ఊరికి బదిలీ చేయమని మా బి.డి.ఓ. గారికి దరఖాస్తు చేసికొన్నాను. ఆయన జీపులో వచ్చి సర్పంచ్, తదితరులందరితో మాట్లాడి చివరకు కళ్ళు తేలవేసి

నాకో ఉచిత సలహా పారేశాడు. "మీ కులం వాళ్ళ ఇళ్ళున్నాయిగా, అక్కడే వుండొచ్చు గదా" అని. నిజం చెప్పొద్దూ నా కోపం నసాళానికంటింది.

ఇక్కడ అసలు సమస్య ఇల్లు కానే కాదు. మనిషిగా గౌరవించడం. నన్ను తమతో సమానంగా గౌరవించేవారైతే వారెందుకు కిరాయికుంచుకోరు? నన్ను గౌరవించని వారికి నా విద్యను నేనెందుకు 'దానం' చేయాలి అనేది నా అహం లేదా ఆత్మ విశ్వాసానికి సంబంధించిన సమస్య. ఆ వూరు నక్సలైట్ల సానుభూతిపరులకు పెట్టింది పేరు. వాళ్ల సంస్కృతే ఈ విధంగా వుంది. ఇంకా వేరే ఊళ్ళ సంగతి ఏం చెప్పను?

"నాకు ఇల్లయినా ఇప్పించండి. బదిలీ అయినా చేయించండి" అని నా డిమాండు. స్కూలు విద్యా కమిటీ మెంబర్లు ఒక్కడూ ముందుకు రాలేదు.

రేణు తమ ఇంట్లో వుండమని కోరుతుందని ఆశించాను. ఆమెలో ఏం ఆలోచనలున్నాయో నాకు తెలియదు. ఏమైనా లోకాన్ని కాదని పెళ్ళి కాని పిల్ల అంత ధైర్యం చేయాలని కోరుకోవడం ఇప్పుడు చూస్తే అత్యాశే అన్పిస్తోంది. కాని ఆ రోజుల్లో యువ ఉత్సాహం కదా! అదీగాక, గొప్ప ఆదర్శాల్లో తేలిపోతున్నవాడిని. ఆమె నన్ను వారింటికి ఆహ్వానిస్తుందనే అనుకున్నాను.

నిజానికి నాకు ఏం తక్కువ. ఉన్నత విద్యావంతుడిని. నా మటుకు నేను అందంగానే ఉంటాను. మాట తీరుకూడా ఎంతో హుందాగా మార్చుకున్నాను. లిల్లీ వాళ్ళమ్మ చలవవల్ల నేను ఎంతో మారిపోయాను. నాకు నేనుగా నా కులం పేరు చెప్పకపోతే నన్నెవరూ తక్కువ అంచనా వేయరని నాకు తెలుసు.

అయినా అవసరం వచ్చినపుడు నా కులం పేరు చెప్పడానికి నేనెందుకు సిగ్గుపడాలి. వారికి వాళ్ళ కులం ఎంత గర్వకారణమో, నాకూ నా కులం అంతే గర్వకారణం.

నేను ఇల్లు కిరాయికి అడిగినపుడు వేరే కులం పేరు చెప్పి వుండాల్సింది అని రేణు అనుకుని వుంటుంది. అడిగినపుడు కులం పేరు దాచేసుకోవడం పరిష్కారమా? పలాయన వాదమా? పైగా అది నా జాతి ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్య.

నాకు ఇల్లు కిరాయికి ఇప్పించలేక బి.డి.ఓ. నేను కోరుకున్నచోటికి బదిలీ చేశాడు. ఆ విధంగా నాలోని ప్రేమ మొగ్గగా నాలోనే వుండిపోయింది.

బదిలీ అయి వెళ్ళేటపుడు గానీ తెలియలేదు. నేను రేణును ఎంతగా ప్రేమిస్తున్నదీ. రేణును వదిలిపోవాలంటే ఏదో బాధ. అప్పటికే కొన్ని ఊహలు చేశాను. నేనొక లెక్చరరుగా, ఆమె టీచరుగా ఇద్దరం భార్యాభర్తలుగా హాయిగా గడపొచ్చునని.

రేణు స్థితీ నాలాగే వుందని అర్థం కావడానికి ఎంతోసేపు పట్టలేదు. రేణు కూడా నన్ను ప్రేమించింది. గాఢంగానే ప్రేమించింది.

ఆ వూరి నుంచి బదిలీ అయినా ఏదో వంకతో రెండు మూడుసార్లు ఆ స్కూలుకు వెళ్లాను. రేణును కలిసాను. ఆమె తల్లిదండ్రుల చేతుల మీదుగా సకల లాంఛనాలతో మా పెళ్ళి జరగాలని మా వాళ్ళ కోరిక.

నాలాంటి విద్యావంతుడు కావోయే లెక్చరరో, ఆర్డీవోనో రేణుకు వాళ్ళు వెతకాలంటే కనీసం అయిదు లక్షలైనా ఖర్చవుతాయి. మనకు కట్నం అవసరం లేదు. వారి సంప్రదాయానుసారం కుటుంబంలో భాగంగా పెళ్ళి చేస్తే చాలు. ఇదేమైనా పెద్ద కోరికా? అన్నారు మా అక్కా చెల్లెల్లు, బంధుమిత్రులు.

మా బంధువుల మాటల్లో వాళ్ల ఆర్తి ఉంది. ఈ కాలంలో స్టేజీ మ్యారేజి ఏమంత గొప్పకాదు. మాల మాదిగలతో రెడ్లు వియ్యం అందుకోవడం జిల్లాలోనే ఒక సంచలనం అవుతుంది. ఎస్సీలు, రెడ్ల యిండ్లల్లో పెండ్లి పిల్లవాడి తరపు బంధువుల గౌరవాలు పొంది భోజనాలు చేయడం..... రెడ్లు

మారుపెళ్ళి భోజనానికి ఎస్సీల యింటికి తరలి వెళ్ళడం.... రెడ్ల యింట్లో మా అక్కాచెల్లెల్లు, బావలు పెండ్లి పిల్లవాడి ఆడపడుచులుగా బావలుగా సకల మర్యాదలు పొందడం జరగాలని వాళ్ళ ఆరాటం. మా అమ్మానాన్నలను సకల గౌరవాల్తో వియ్యంకులుగా ఆ రెడ్ల బంధువులంతా మర్యాదతో చూసుకోవాలని వాళ్ళ ఆర్తి. అందుకని వాళ్ళ సంబంధం వద్దని ఏడ్చేశారు. చేసుకుంటే నీ ఒక్కడి సుఖమే చూసుకుంటావా అన్న వాళ్ళ మాట గుండెల్లో సూటిగా దిగబడింది.

నిజమే. వాళ్ళకు నా తల్లిదండ్రులుగా, అక్కాచెల్లెండ్లుగా, బంధువులుగా రేణు యింట్లో దక్కాల్సిన గౌరవాలు దక్కాలని కోరుకోవడంలో ఎంతో న్యాయం ఉంది. పెండ్లి చూపుల పేరుతో మా యింటికి రెడ్లు రావడం, వాళ్ళ యింటికి మావాళ్ళు వెళ్ళడం ఎంత ఆనందాన్నిస్తుందో మా వాళ్ళకు. పూలుపండ్లు, వరపూజ చేసికొని భోజనాలు చేయడం, పెండ్లి ఎదురుకోల్లు..... పెండ్లి పిల్లవాడి తల్లికి పట్టుచీర కొనడం.... పిల్ల పిల్లవాడు మావాళ్ళ యింటికి తరలి రావడం.... ఎస్సీలు ఆనంద పరవశులు కావడం.... వియ్యపు రాళ్ళవైనం..... కట్నకానుకలు.... రెండు పక్షాలూ కానుకలు పెట్టుకోవడం, వొడిబియ్యం పోసి కాళ్ళు మొక్కుకోవడం, అలగపోవడం, ఒకే బంతిలో కూరకల్లు కల్సి తిని తాగడం కొసరి కొసరి వడ్డించుకోవడం..... పిల్లను అప్పగించడం.... బ్యాండుమేళాల్తో పిల్ల పిల్లవాడు ఎస్సీల యింటికి తరలి రావడం.... ఓహో.... మా అక్కాచెల్లెల్లు వర్ణిస్తుంటే వాళ్ళ ఆశల్లో వాళ్ళు కోరుకున్న సంస్కృతిలో న్యాయం ఉంది. వాళ్ళు కోరింది జరిగితే ఓహో... ఒక్కటేమిటి.... కుల సంస్కృతిలో దాన్ని బదాబదలు చేసే సాంస్కృతిక విప్లవంగా యిది పరిణమిస్తుంది. మా వాళ్ళ చిన్న కోరికల్లో యింత పెద్ద క్రమం ఉంది. మా బంధువుల కోరికల్ని కాదనలేకపోయాను. నాకూ ఆ రకమైన నా కులం తాలూకు యిన్ఫీరియారిటీ కాంప్లెక్సు నుండి ఎదిగి సాంఘిక గౌరవం అందుకోవడానికి యిదే సరైన మార్గం అన్పించింది. అందుకని సకల లాంఛనాలతో సంప్రదాయక పద్ధతిలోనే పెళ్ళి జరగాలని పట్టుపట్టాను.

రేణుక, రేణుక ఫ్రెండ్సూ, నా ఫ్రెండ్సూ అది సాధ్యం కాదన్నారు. కొండగట్టుకో, వేములవాడకో లేదా తిరుపతికో వెళ్లి దేవుడి సమక్షంలో పెళ్ళి అయిందనిపించుకుంటే ఆ తర్వాత తల్లిదండ్రులు వారే అంగీకరిస్తారు అన్నది వారి సారాంశం.

చదివేడిస్తే ఉన్న మతి పోతున్నట్టుంది వారికి. సమస్య పరిష్కారం వాళ్ళ తల్లిదండ్రుల చేతుల్లో వుండగా, ఏదో కాని పని చేసినట్టు పెళ్ళి చేసికోవడానికి మాకేం ఖర్మ? నీకన్నా ఎక్కువ చదివి ఉద్యోగం చేస్తున్న అమ్మాయిల్ని ఇద్దామని నీకు క్యూ కట్టారు. వాళ్లందర్నీ కాదని ఈ దిక్కుమాలిన రీతిలో పెళ్లి చేసికోవాలా - ఛీ - వారి సలహాలు విని అసహ్యించుకొని చాలా బాధపడ్డారు మావాళ్ళు.

చివరకు ఎమ్మెల్యే, ఆర్డీవోలు ముఖ్య అతిథులుగా స్టేజి మ్యారేజి లేదా రిజిష్టరు మ్యారేజి ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడికి అదేదో ఘనకార్యం అయినట్టు. అసలు మనుషుల్ని మార్చలేక ఈ పలాయన వాదాలెందుకో మావాళ్ళకసలు గిట్టలేదు. సమాజం మారినా కుటుంబం మారడానికి సిద్ధం కావడం లేదేమి? మారుతున్న ఈ సమాజాన్ని మారకుండా కుటుంబం అనేది తన బందీగా మార్చేస్తోందా?

నేను రేణును ప్రేమించడం నా అర్హతకు మించిందా? రేణు నా కన్నా మంచి వరుణ్ణి పొందడం సాధ్యమేనా? అని మావాళ్ళు ప్రశ్నిస్తే వారి బంధుమిత్రులు మౌనం దాల్చారు. వారికి తెలుసు. రేణు జీవితం గొప్పగా వుండబోతుందని. అయినా రేణు ఇంట్లోనే సంప్రదాయికంగా పెళ్ళి చేయడానికి ఎందుకు అంగీకరించరూ? ఏమిటి వారి గొప్ప? ఎందులో?

మావాళ్ళను సముదాయించడానికి చేసే వాదనలు నన్ను కూడా శూలాల్లా గుచ్చాయి. స్పష్టంగా కనపడే కులాన్ని పక్కనపెట్టి ఎన్ని సిద్ధాంతాలు దంచుతారో వీళ్ళు. చూస్తుంటే రోత పుట్టింది. కులాల

మధ్య సమన్వయం సాధించాలంటే కనీసం నీలాంటి ప్రేమ పెళ్ళిళ్లయినా తల్లిదండ్రుల చేతుల మీదుగా జరగాలి గదా! అన్నారు నా ఫ్రెండ్స్.

రేణు నాతో లేచి రావడానికి సిద్ధపడింది. నేను వద్దన్నాను. వారి కులానికంతటికీ నేను శత్రువు నెందుకవ్వాలి. వాళ్ళు నన్ను అల్లుడుగా స్వీకరించనపుడు జరిగే పర్యవసానాలు మా కాపురాన్ని విచ్ఛిన్నం చేయవని గ్యారంటీ ఏమిటి? రంగనాయకమ్మ 'బలిపీఠం' నవలతో ఏనాడో హెచ్చరించింది కూడా.

రేణు కోసం నేను రెండేళ్ళు ఆగాను. ఈలోపు ఆర్డీవోగా ఎన్నికయ్యాను. రేణుక తరపు బంధువులు కూడా ఎంతో సంతోషించారు. ఆర్డీవోనయ్యాను గనక ఇకనైనా తల్లిదండ్రుల చేతుల మీదుగా పెళ్ళి చేస్తారని ఆశించాను. అదీ అడియాసే అయ్యింది.

మా నాయినా, అవ్వా, అక్కా కలిసి రేణుక ఇంటికి పెళ్ళి చూపులకు వెళ్లారు. రేణును తమలో కలుపుకోవడానికి అంగీకరించారు. నాకు చాలా సంతోషం వేసింది.

రేణూ, వాళ్ల అమ్మా నాన్నా నేను ఉద్యోగం చేస్తున్న చోటికి మరో నలుగురితో కలసి రాయబారానికి వచ్చారు. స్టేజి మ్యారేజి చేసికొమ్మని, పెళ్ళయ్యాక అన్నీ సజావుగా జరిగేట్టు చూసుకుంటామనీ.

రేణు తల్లిదండ్రులు ఈ కాస్త దిగివచ్చినందుకు లోలోపల సంతోషం వేసింది. వాళ్ళు నన్ను నన్నుగా నిజంగా అంగీకరిస్తే వాళ్లింట్లోనే పెళ్ళి చేసి పంపవచ్చుగదా! అదే మాట మర్యాద పద్ధతిలో అడిగాను. వారి నుంచి అవే పేలవమైన జవాబులు.

రేణుకను హృదయపూర్వకంగా ప్రేమిస్తున్న మాట నిజం. అయితే నాది టీనేజ్ ప్రేమ కాదు. ప్రపంచాన్ని చూస్తున్నాను. నాకు విద్య మీద గల ఆసక్తి కారణంగా తొమ్మిదో తరగతిలో నా పెళ్ళి చేసిన తల్లిదండ్రులు కోడలు పెద్దమనిషైందని తొందర పెడుతుంటే విడాకులకు అంగీకరించారు. ఆమె యిపుడు రెండో సంబంధంతో సుఖంగా బతుకుతోంది.

ఏ వయస్సుకు ఆ ముచ్చట తీరడంలోనే ఆనందం ఉంటుందనుకుంటాను.

ఆర్డీవో కివ్వడానికి అమ్మాయిలు కరువా? యూనివర్శిటీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మల్లిక నాకు బాగా నచ్చిన సంబంధం. మా అవ్వా, నాయనలకు దూరపు బంధువుల పిల్ల కావడంతో వాళ్ళు మరీ సంతోషించారు.

మా పెళ్ళికి రేణుకను కూడా ఆహ్వానించాను. రేణు వస్తుందని తెలుసు. వచ్చింది. ఏమీ జరగనట్టుగానే అందర్తో హాయిగా గడిపి వెళ్ళింది. వెళ్లే ముందు ఆ కళ్ళల్లోని జీవం ఇక్కడే వదిలేసుకుని వెళ్ళినట్టుంది. నా హృదయం కలుక్కుమంది. నేనేమైనా పొరపాటు చేశానా అని మొదటిసారిగా విలవిలలాడాను.

రేణు ఇప్పుడు జెడ్.పి. స్కూలు అసిస్టెంటుగా జాబ్ చేస్తోంది. రెండు మూడు సంబంధాలు వస్తే తిరగ్గొట్టిందని విన్నాను. నా మనస్సులో ఏదో బాధ తొలిచి వేయడం ప్రారంభించింది.

మల్లికకు నా ప్రేమ వృత్తాంతం చెప్పాను. బాగా అనునయించింది. మల్లిక నాకు ప్రేమను పంచిన ప్రేమ స్వరూపిణి. నా కోసమే దాచినట్టుగా ఇన్నాళ్ళ ప్రేమ భాండాన్ని నాకందించింది. మాకు ఇద్దరు పిల్లలు.

రేణు అపుడపుడు వచ్చిపోతూ వుంది. మల్లిక రేణుపై అనుమానపడినట్టేమీ లేదు. ఇద్దరూ హాయిగా అక్కాచెల్లెల్లుగా కల్సిపోయారు.

రేణు లోకాన్ని పట్టించుకోవడం తగ్గించింది. నేను ఆమెను వుంచుకున్నాను అనే పుకార్లు నా చెవికి కూడా సోకాయి. ఉంచుకోవడం ఏం ఖర్మ ఏకంగా ధర్మపత్నే అయ్యేదిగదా అని అరవాలనిపించేది.

కానీ ఎవరితో అరవను!

మల్లిక నోటి నుండి ఈ ప్రతిపాదన వస్తుందని నేనూహించలేదు. రేణుకను రెండో భార్యగా స్వీకరించాలని వేడికోలు. స్త్రీల్లో మల్లిక లాంటి వారు కూడా వుంటారా! ఊహించలేక పోయాను.

కానీ ఈ ప్రతిపాదన ఎందుకో నాకు నచ్చలేదు. రేణుని నేను ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. రేణు హృదయం నిండా నేనే వున్నానని కూడా నాకు తెలుసు. "మేం ఇద్దరం అంగీకరించాక నీకేమిటి అభ్యంతరం" అని మల్లిక వేసిన ప్రశ్న నాకు ఎక్కడో తగిలింది. నేను ఏమైనా వస్తువునా కల్పి పంచుకోవడానికి?

బ్రోకరు పనిచేసి మందికి తార్చి కూతురి సంపాదనకు ఎగబడ్డాడనే సూటిపోటి మాటలు భరించలేక రేణు నాన్న ఆత్మహత్య చేసికొన్నట్టు తెలిసింది. విలవిలలాడిపోయాను. ఏం చేయాలో తోచలేదు. ఇంటికి వెళ్ళి ఓదార్చితే సమస్య జటిలమవుతుందనిపించింది.

లిల్లీ వాళ్ళమ్మను పంపాలనిపించింది. మొదటిసారిగా జానకికి విషయమంతా చెప్పేశాను. "నీలో పట్టుదలే వుందనుకున్నాను గానీ నీవు మరీ ఇంత మొండి మూర్ఖుడివి అనుకోలేదు" అంటూ జాడించింది. నా అహమే ఇంత జరగడానికి కారణం అని తిట్టింది. చేతులారా రెండు జీవితాల్ని నాశనం చేశావంది. "ఇప్పటికైనా రేణుకు జరిగిన అన్యాయం సరిదిద్దు" అంటూ "నీవే రేణు దగ్గరికి వెళ్ళిరా" అంది. జానకి నన్నొక్కణ్ణే తప్పు పట్టడం బాధ కలిగించింది.

నా లిల్లీకి ఈ విషయం చెప్పుకొని ఊరట పొందాలనిపించింది. లిల్లీ మల్లెపూవులా నవ్వి "దీనికింత వర్రీ అవుతున్నావేంది బాబాయ్ - అమ్మ చెప్పిందాన్లో తప్పేముంది" అంది.

జానకి, లిల్లీ ఇద్దరూ నన్నే తప్పు పడ్తున్నారు. అదే నన్ను కలచివేస్తోంది. నిజంగా నేను తప్పు చేశానా? నేను క్రూరంగా ప్రవర్తించానా? వాళ్లే నా పట్ల నీచంగా ప్రవర్తించారా? నా అహం కోసం నేను రేణును దూరం చేసుకున్నానా? జరిగిందానికి రేణు తల్లిదండ్రుల, బంధుమిత్రుల బాధ్యతేమీ లేదా?

ఈరోజు ఆర్డీవోనయ్యాను గనక అనునయిస్తున్నారు. అదే టీచరుగా వుంటే ఇలాగే స్పందిస్తారా? ఏమో! నాకా విశ్వాసం లేదు.

ఒకటి నిజం - నేను రేణును ప్రేమించింది నిజం. నా జీవితంలో ప్రేమంటే తెల్సుకుని హృదయం విప్పారిన క్షణాలు రేణు సన్నిధిలోనే.

రేణు ఊరికి బయల్దేరాను. ఆ యింటికి చేరేసరికి పెద్దకర్మ ఏర్పాట్లు చూస్తున్న రేణు నన్ను పట్టుకొని భోరున ఏడ్చేసింది. నాకూ దుఃఖం ఆగలేదు.

28-4-95,

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక.

('దళిత కథలు' 1996 సంకలనం నుండి)